క్లుప్తంగా

నేటి నుంచి ఆన్‌లైన్‌లో నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ రమణారెడ్డి

పి.గన్నవరం: అర్హత ఉన్న వారందరినీ ఆన్‌లైన్ ద్వారా కొత్త ఓటర్లుగా నమోదు చేయించాలని, ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. శనివారం కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు, మార్పులు వంటి దరఖాస్తులను స్వీకరించామన్నారు. ఈనేపథ్యంలో తమకు వచ్చిన 4918 దరఖాస్తులు పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక అధికారి ఎం.ప్రభాకరరావు, తహసీల్దార్లు జి.రవీంద్రనాథ్ ఠాగూర్, నాగలక్ష్మమ్మ, టి.మంగతాయారు, డిప్యూటీ తహసీల్దార్లు బి.గోపాలకృష్ణ, అశోక్‌కుమార్, నాగలక్ష్మి పద్మ, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిలు

అంబాజీపేట: గ్రామాల్లో ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు అందించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. కె.పెదపూడిలో జలజీవన్ మిషన్ నిధులు రూ.25 లక్షలతో నూతన పైపులైన్లు నిర్మాణానికి ఎమ్మెల్యే శనివారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతీ ఇంటికి పైపులైన్లు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. త్వరలో పైపులైన్లు నిర్మాణాన్ని పూర్తి చేసి తాగునీరు అందిస్తామన్నారు. ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కో ఆర్డినేటర్ పేరి శ్రీనివాస్, వాసర్ల మరడి, ఉందుర్తి ఆనందబాబు, శ్రీనివాసరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు శనివారం పలువురు విరాళాలు అందించారు. పాశర్లపూడిబాడవకు చెందిన కొర్లపాటి రామారావు, సీతామహలక్ష్మి దంపతులు రూ.50,116 విరాళం అందించారు. ఉప్పలగుప్తం మండలం సీతారామపురానికి చెందిన జంగా సత్యనారాయణమూర్తి, సుజాత దంపతులు రూ.10,116 విరాళం అందించారు. దాతలకు ఆలయ ఈఓ జి.మాధవి, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీనృసింహుని నిత్యాన్నదానం ట్రస్టుకు అంతర్వేదిపాలెం వీరావారి మెరక గ్రామానికి చెందని వీరవెంకన్న బాబు, వెంకట సత్యఅన్నపూర్ణ దంపతులు రూ.1,00,116 విరాళం అందజేశారు. వారికి ఆలయ సూపరింటిండెంట్ పి.విజయసారథి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

రావులపాలెం: స్థానిక రౌతు కాశీ చారిటబుల్ ట్రస్ట్, ఆడ బాల ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు సమకూర్చిన న్యూట్రిషన్ కిట్లను, దుప్పట్లను దివ్యాంగులకు అందజేశారు. స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. రౌతు ఈశ్వరరావు (కాశీ) ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి ఉచిత పరీక్ష నిర్వహించి మందులు, పండ్లు పంపిణీ చేశారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దేశ వ్యాప్తంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదరిక రహిత సమాజ స్థాపనకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశేష కృషి చేస్తున్నారని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొట్లూరి రామమోహన్‌రావు అన్నారు. మండలంలోని చింతలూరు, మూలస్థానం అగ్రహారం గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద శనివారం వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జరిగింది. సర్పంచు మార్గాని కరుణయేసు, లంక వర ప్రసాదరావు, వైస్ ఎంపీపీ నేలపూడి రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని ప్రసంగించారు. బీజేపీ నేతలు పాలూరి సత్యానందం, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, నాగిరెడ్డి స్వామి, బలుసు శ్రీనివాస్, సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, బి.వరలక్ష్మి, టి.ఆంజనేయులు, కార్యదర్శులు కె.వెంకటరెడ్డి, పి.రాజు పాల్గొన్నారు.

పంచభూత లింగాలు, అరుణాచలానికి ప్రత్యేక బస్సు

రావులపాలెం: మార్గశిర పౌర్ణమి సందర్భంగా రావులపాలెం డిపో నుంచి అరుణాచల గిరిప్రదక్షిణ, పంచభూత లింగాల దర్శనానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ కేవీఎంఎస్ కుమార్ శనివారం తెలిపారు. ఈ బస్సు ఈ నెల 25 తేదీన బయలుదేరి 30 తేదీన రావులపాలెం చేరుతుందన్నారు. ఐదు రోజులపాటు యాత్ర సాగుతుందన్నారు. టికెట్ ధర రూ.4,300 నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు, టికెట్లకు 7382911871 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

నిబంధనలు సడలించి రైతులకు న్యాయం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- గ్రామాల్లో పంట నష్టం పరిశీలన



పలివెలలో సీఎస్ జవహర్‌రెడ్డితో కలిసి ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి. చిత్రంలో కలెక్టర్ హిమాన్షుశుక్లా

కొత్తపేట: సాధారణంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటలు నష్టపోతే నిబంధనలు ప్రకారం ప్రతీ పంటకు నిర్ణీత పరిహారం ఉంటుందని, అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆ నిబంధనలు సడలించి నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, కలెక్టర్ హిమాన్షుశుక్లాతో కలిసి ఆయన శనివారం నియోజకవర్గంలో తుపాను పంట నష్టాన్ని పరిశీలించారు. దానిలో భాగంగా మండల పరిధిలోని పలివెల శివారు చొదరిపురం ప్రాంతంలో ముంపునకు గురైన వరి పంటను, తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో నిబంధనలు సడలించి వెసులుబాటు కల్పించి రైతులను ఆదుకున్న పాపాన పోలేదన్నారు. అసలు నిర్ణీత పరిహారం కూడా సక్రమంగా ఇచ్చింది లేదన్నారు. గతంలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ఆ నాయకులు ఆ హామీ గాలికొదిలేసి రైతులను మోసం చేసి, ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని జగ్గిరెడ్డి ఎద్దేవా చేశారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు, కేంద్రం రద్దు చేసి చేతులు దులిపేసుకున్న పంటల బీమా పథకాన్ని మొత్తం భరిస్తుందన్నారు. రైతుకు ఏవిధమైన భారం లేకుండా 'ఉచిత పంటల బీమా'గా మార్చిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో రైతులకు నష్టం వాటిల్లితే పరిహారం ఎప్పటికో అందేదని, కొన్ని సంవత్సరాల పరిహారం అమలు చేసిన దాఖలాలు కూడా లేవన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితిని సమూలంగా మార్చేసి ఏ సీజన్‌లో నష్ట పరిహారం ఆ సీజన్‌లోనే అందచేస్తుందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కౌలు రైతులకు కూడా మేలు చేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే జగనన్న ప్రభుత్వమేనని అన్నారు. ఉనికి చాటుకోవడం కోసం టీడీపీ నేతలు అసత్యాలు, అవాస్తవాలు ఏకరువు పెట్టినా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎంత మేలు జరిగిందో రైతులకు తెలుసన్నారు. కల్లబొల్లి కబుర్లతో కాలక్షేపం చేయడం, సోషల్ మీడియాలో గోల చేయడం ప్రతిపక్షాలకు అలవాటుగా గాని, పని చేసి చూపించడం సీఎం జగన్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డిల నైజం అని ప్రజలు గుర్తించారన్నారు. ఒక పక్క ప్రభుత్వం ద్వారా వివిధ అభివృద్ధి, సహాయక కార్యక్రమాలు అమలు చేస్తున్న దశలో, వివిధ సమస్యలు పరిష్కారమవుతున్న దశలో ఆయా కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా డిమాండ్ చేయడం ద్వారా ఆయా పనుల ఘనత తమ ఖాతాలో వేసుకోవాలనే ప్రతిపక్షాల ప్రయత్నాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ చేష్టలకు స్వస్తి చెపితే కనీస గౌరవమైనా మిగులుతుందని హితవు పలికారు. ఆయన వెంట ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్ తధితరులు ఉన్నారు.

మంత్రి వేణుకు ఘన సత్కారం



ఆలమూరులో రాష్ట్ర మంత్రి వేణును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆలమూరు: రాష్ట్ర ప్రజలందరి సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ అన్నారు. ఆలమూరులోని రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకర రావు ఇంట్లో జరిగిన శుభకార్యానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వేణును చల్లా కుటుంబ సభ్యులు, తణుకు వేదనిధి ప్రైవేట్ బ్యాంకర్స్ చైర్మన్ జి.వివేకానందస్వామి ఘనంగా సత్కరించి మెమెంటోను బహూకరించారు. తిరుపతి నుంచి తీసుకువచ్చిన కళ్యాణ లడ్డూను అందజేశారు. అనంతరం నేటి సమకాలీన రాజకీయ స్థితి గతులపై రాష్ట్ర మంత్రి వేణుతో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు చర్చించారు. వైఎస్సార్ సీపీ నేతలు రెడ్డి చంటి, వాసంశెట్టి సాయిబాబా, నాంద్ర నాగ మోహన్ రెడ్డి, చల్లా నానాజీ, చల్లా భూషణం, నామన దుర్గా ప్రసాద్, కొపనాతి శ్రీనివాస్, ఉండమట్ల బూరయ్య, రావూరి శివ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో సీఎస్ జవహర్‌రెడ్డి

- వెంకన్న ఆలయంలో పనుల పరిశీలన
- జవహర్‌రెడ్డి దృష్టికి రైతు సమస్యలు తీసుకెళ్లిన జగ్గిరెడ్డి



స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. కలెక్టర్ హిమాన్షుశుక్లా, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన స్వామివారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా జవహర్‌రెడ్డికి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన భక్తుల నుంచి వివరాలు సేకరించారు. ఆలయ అభివృద్ధిపై ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వివరించారు.

పంట నష్టం వివరాలు జవహర్‌రెడ్డి దృష్టికి...

ఆత్రేయపురం మండలంలోని లొల్ల, మెర్లపాలెం గ్రామాల్లో కళ్లాల్లో ధాన్యం ఆరబోసుకుంటున్న రైతుల వద్దకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి జవహర్‌రెడ్డిని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తీసుకెళ్లారు. రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు, పంట నష్టం, పంట కాలువల ఆధునీకరణలో భాగంగా చేపట్టాల్సిన పనులను రైతుల ఎమ్మెల్యే తరుపున వివరించారు. పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్, రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు తదితర విషయాలను కలెక్టర్ హిమాన్షు శుక్లా వివరించారు. ఉపాధి హామీ వేతనదారులతో చేపట్టిన ముంపు నీటి మళ్లింపు కాలువల పనులు ధాన్యం ఆరబెట్టడంలో రైతులకు సహకారం అందించిన విషయాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన క్రాప్ ఇన్సూరెన్స్ ద్వారా రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి, ఎంపీపీలు కుండ అన్నపూర్ణ, మార్గన గంగాధర్, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, ఆర్డీఓ ముక్కంటి, తహసీల్దారు అనిల్‌కుమార్, ఎంపీడీఓ నాతిబుజ్జి, నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

వీరభద్రుని పీఠాన్ని దర్శించిన సీఎస్

రావులపాలెం: జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి శనివారం రావులపాలెంలోని వీరభద్రుని పీఠాన్ని దర్శించుకున్నారు. గ్రామంలోని పడాల రామిరెడ్డి స్వగృహంలో వీరభద్రుని పీఠం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



రాజోలు కోర్టులో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి

రాజోలు: లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సేవా సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలారాణి అన్నారు. శనివారం రాజోలు కోర్టు కాంప్లెక్స్‌లో జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. దీని ద్వారా 111 కేసులను పరిష్కరించారు. రూ.48.56 లక్షలను రికవరీ చేశారు. సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలారాణి, మెంబర్ రిటైర్డ్ ఎంపీడీఓ ఎల్.వి.ప్రసాద్ మొదటి బెంచ్, జూనియర్ సివిల్ జడ్జి కె.హిమబిందు, మెంబర్ ఉపాధ్యాయుల మహేశ్వరరావు రెండో బెంచ్‌గా కేసులను పరిష్కరించారు. రాజోలు కోర్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న 92 కేసులతోపాటు 19 ప్రిలిటిగేషన్ బీఎస్ఎన్ఎల్ కేసులను పరిష్కరించారు.

కొత్తపేట: స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 96 కేసులు పరిష్కరించారు. జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.భాస్కరరావు అధ్యక్షతన జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.వజ్రకుమార్ పాల్గొన్నారు. వివిధ సివిల్, క్రిమినల్ కేసులు విచారించారు. మనీ దావా కేసులు ఆరు, టైటిల్ దావా కేసులు మూడు, చెక్ బౌన్స్ కేసులు నాలుగు, మెయింటెనెన్స్ కేసు ఒకటి, సీసీ ఐపీసీ కేసులు 33, ఈపీ ఒకటి, బీఎస్ఎన్ఎల్ కేసులు 20 పరిష్కరించారు. ఆయా కేసుల ద్వారా రూ.58,75,836 రికవరీ చేశారు.

లక్ష్యాలకు అనుగుణంగా చదువుకోవాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీసీపీ సత్తిబాబు దంపతులు

మామిడికుదురు: విద్యార్థులు కష్టపడి చదువుకుని తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలని విజయవాడ డిప్యూటీ పోలీస్ కమిషనర్ మోకా సత్తిబాబు అన్నారు. పాశర్లపూడిలో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక, కార్తిక వన సమారాధన డీసీపీ మోకా సత్తిబాబు, రమాదేవి దంపతులు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగింది. నిరుపేద కుటుంబంలో పుట్టిన తాను ఎంతో కష్టపడి చదువుకుని 12 ఏళ్లు హిస్టరీ లెక్చరర్‌గా పని చేశానని చెప్పారు. ఎంతో మంది నిరుపేదలు చదువుకునే స్థోమత లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అటువంటి వారికి తాను అండగా నిలుస్తున్నానన్నారు. ఆత్మీయ కలయికలో పాల్గొన్న పూర్వ విద్యార్థుల కుటుంబాలకు చెందిన చిన్నారులు, మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, తోరం సూర్యభాస్కర్, నిర్వాహకులు మట్టా సత్తిబాబు, తాడి శేఖర్, కుసుమ అప్పారావు, గోసంగి బంగార్రాజు, అధికారపు వీరన్న, నందిక వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ

మామిడికుదురు: మండలంలో అప్పనపల్లి, పాశర్లపూడి గ్రామాల్లోని శివాలయాల్లో శనివారం లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. అప్పనపల్లిలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, పాశర్లపూడి ఉమా చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంతో పాటు శ్మశాన వాటికలో ఉన్న శివాలయంలోను లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ఆలమూరు: గ్రామాల్లోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి,జొన్నాడ గ్రామాల్లోని ఆలయాలు భక్తులు గోవింద నామస్మరణతో మార్మోగాయి.

అయినవిల్లి: నల్లచెరువు గ్రామంలోని వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం కూడా భక్తులు పోటెత్తారు.

మామిడికుదురు: అయ్యప్ప దీక్ష పూర్తి చేసిన స్వాములు శనివారం ఇరుముడులు కట్టించుకుని శబరిమల అయ్యప్ప దర్శనానికి పయనమయ్యారు.

ఆత్రేయపురం: గ్రామ దేవత శ్రీమల్లమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రధాన అర్చకులు పుల్లేటికుర్తి నాగబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముదునూరి సత్యనారాయణరాజు, లక్ష్మీకాంతం దంపతులు పాల్గొని ఈ పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయంలో మహిళలు పారాయణం చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: పొడగట్లపల్లిలో శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామంలోని ఉప్పలపాటి జానకమ్మ నిత్యాన్నదానం సత్రంలో ఏర్పాటు చేసిన వన సమారాధనలో పాల్గొన్నారు. సత్రం వద్ద చైర్మన్ కొపెల్ల మల్లి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను, పలువురికి స్కాలర్‌షిపులు అందజేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించి హెల్త్ క్లినిక్ సెంటర్, అగ్రికల్చర్ ప్రొడక్ట్స్ స్టోరేజ్ సెంటర్లను, సీసీ రోడ్లను ప్రారంభించారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ..

అయినవల్లి: వీరవల్లిపాలెంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శనివారం సందర్శించారు. ఆరోగ్యకేంద్రంలో ప్రతి విభాగాన్ని పరిశీలించారు. ఆస్పత్రి సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ అయినవిల్లి, అంబాజీపేట అధ్యక్షులు కుడుపూడి విద్యాసాగర్, వాసంశెట్టి చినబాబు, కొరెడ్డి అంజిబాబు, మిండగుదిటి రాంబాబు, కోరపు రవి, రాజా ఉన్నారు.

మతాలకు అతీతంగా సీఎం జగన్ సేవలు అభినందనీయం

రాజోలు: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సేవలు అందిస్తున్నారని ఏపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్ల వరపు జాన్ వెస్లీ అన్నారు. శనివారం కడలి గ్రామంలో కోనసీమ జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(కేపీడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేపీడబ్ల్యూఏ అధ్యక్షుడు డాక్టర్ శ్రావణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాన్‌వెస్లీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈద శశిభూషణ్, బిషప్ సిరిల్ జాషువా తదితరులు క్రీస్తు బోధనలను వివరించారు అనంతరం వివిధ గ్రామాలకు చెందిన పాస్టర్లకు దుస్తులు, బహుమతుల కిట్లను అందజేశారు. కేపీడబ్ల్యూఏ కార్యవర్గ సభ్యుడు బిషప్ ఏసుపాదం, శాలెం రాజు, డేనియల్, రాజారత్నం, సిస్టర్ సంధ్య పాల్గొన్నారు.

ఘనంగా శాంతి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి వారి దేవస్థానంలోబహుళ ద్వాదశి సందర్భంగా స్వామి వారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటిండెంట్ విజయ సారథి, అర్చకులు, భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించినారు.

వ్యవసాయ ప్రోత్సాహకాల్లో ఏపీదే అగ్రస్థానం

- రాజ్యసభ సభ్యుడు బోస్
- బీసీ సామాజిక భవన నిర్మాణానికి భూమిపూజ



వక్కలంకలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బోస్, ఎమ్మెల్యే చిట్టిబాబు తదితరులు

అంబాజీపేట: ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వ్యవసాయ రంగానికి అన్ని రకాల ప్రోత్సాహకాలు అందించడంలో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానమని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. ఎంపీ నిధులు రూ.25 లక్షలతో వక్కలంకలో నిర్మించనున్న బీసీ సామాజిక భవన నిర్మాణానికి శనివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి వాసంశెట్టి రేవతి అధ్యక్షతన జరిగిన సభలో సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ వ్యవసాయం లాభదాయకమైన రంగమా.. నష్టదాయకమైన రంగమా.. అంటే లాభదాయకరంగమని ఎవరూ చెప్పలేరని, ప్రతి రెండు మూడేళ్లకోసారి వచ్చే తుపానుల వలన పంట నష్టాన్ని చవి చూస్తూ లాభదాయకమైన రంగమని ఎలా చెప్పగలరన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా వెనకబడిందని ప్రతిపక్షాలు గోల చేస్తున్నాయని, 16 వేల కోట్ల రెవెన్యూ లోటుతో నూతన రాష్ట్రం ఏర్పడినా కేంద్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయం అరకొరగా సాగుతుందన్నారు. అయినా సంక్షేమ పథకాలు అందించడంలో వైఎస్సార్ సీపీ వెనకంజ వేయలేదన్నారు. ప్రధానంగా వ్యవసాయం, వైద్య, విద్య మూడు రంగాలపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాలలో 50 లక్షల మంది రైతులు ఉన్నారని, ప్రత్యక్షంగా పరోక్షంగానో 65 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారమన్నారు. కౌలు రైతుల్లో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 65 శాతం మంది బీసీ వర్గాల్లోని బీసీలదే అగ్రస్థానమని, పదిహేను శాతం ఎస్సీ వర్గాల వారు ఉన్నారన్నారు. ప్రోత్సహించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో 1.40 వేల కోట్లను కేటాయించిందన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ హక్కు చట్టంపై ప్రతిపక్షాల రాద్ధాంతం చేస్తున్నాయని, మన భూమిని మనం రక్షించుకునేందుకే ప్రత్యేక రక్షణ చట్టాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించిందని, నాడు నేడుతో పాఠశాల అభివృద్ధి చేసిందన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు బోస్‌తో పాటు ఎమ్మెల్యే చిట్టిబాబును, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పి.కె.రావులను సర్పంచి దంపతులు వాసంశెట్టి రేవతి, పెదబాబుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ పేరి శ్రీనివాస్, ఎంపీటీసీ పిల్లి సత్యవేణి, సొసైటీ అధ్యక్షుడు వాసంశెట్టి రాంబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెటి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదం

మా స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేయవద్దని గ్రామంలోని బాలయోగికాలనీకి చెందిన దారా రమణమూర్తి రాజ్యసభ సభ్యుడు బోస్‌కు, ఎమ్మెల్యే చిట్టిబాబులకు వివరించాడు. మా పూర్వీకుల నుంచి వచ్చిన స్థలాన్ని ఆక్రమించి కమ్యూనిటీ భవనం కడుతున్నారని దానిని ఎట్టి పరిస్థితుల్లో నిర్మించకుండా తమ స్థలాన్ని తమకు ఇప్పించి న్యాయం చేయాలని ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ స్థల వివాదం కోర్టులో ఉందని చెప్పారు. ఈ సమయంలో రెండు సామాజిక వర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకోవడంతో సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఇరువురుని వారించారు. దీనిపై బోస్, చిట్టిబాబులు స్పందించి మాట్లాడుతూ అందరూ ఐక్యతతో కలిసి కట్టుగా ఉండాలన్నారు. కోర్టు పరిధిలో ఉన్న స్థలాన్ని వదిలిపెట్టి మిగిలిన సీతారామాలయ స్థలంలో కమ్యూనిటీ భవనాన్ని నిర్మించుకోవాలని, ఇరువురు శాంతి కమిటీని వేసి సామరస్యంగా చర్చించుకోవాలన్నారు. దాంతో ఇరువురు అంగీకరించడంతో వివాదం సద్దుమనిగింది.

నాఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బోస్

అంబాజీపేట: ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్ర బోస్ అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న నాఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని శనివారం బోస్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొబ్బరి రైతులకు ఇబ్బందులు లేకుండా కొబ్బరిని కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన వారం రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పి.కె.రావు, సొసైటీ అధ్యక్షుడు వాసంశెట్టి రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



రాజేశ్ తల్లికి సాయం అందిస్తున్న వారధి సంస్థ ప్రతినిధులు

మలికిపురం: గత ఏడాది రైలు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురానికి చెందిన కళ్యాణి రాజేష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం మలికిపురం వారధి ఫౌండేషన్ రూ.20 వేల ఆర్థిక సాయం అందించింది. రాజేష్ తల్లికి శనివారం నగదును అందించారు. వెన్నెముక దెబ్బతిన్న రాజేష్‌కు ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నప్పటికీ ఇతర వైద్య ఖర్చులు ఉండడంతో ఆ సంస్థతో పాటు పలువురు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందిస్తున్నారు. సంస్థప్రతినిధులు శృంగారపు గంగాధర రామారావు, దొంగ శివ రామ కృష్ణ, ఆచంట శ్రీనివాసరావు, హెచ్‌ఎం బాలచింతామణి పాల్గొన్నారు.

బాలుడికి ఆర్థిక సాయం



బాలుడి తల్లికి సాయం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అంబాజీపేట: అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ బాలుడికి అంబాజీపేట యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూ.39,300 ఆర్థిక సాయం శనివారం అందించింది. మండలంలోని ఇరుసుమండ శివారు యార్లగడ్డవారిపాలెంలో ఇటీవల గురాని దిశ్వంత్ అగ్నిప్రమాదానికి గురై అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పేద కుటుంబ కావడంతో యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.నారాయణమూర్తి, జి.రాంబాబుల ఆధ్వర్యంలో బాలుని తల్లితండ్రులకు సాయాన్ని అందించారు. బి.సత్యనారాయణ, బీఆర్ఎల్.శ్రీనివాస్, బి.విజయ్‌కుమార్, బి.వి.శ్రీసత్యలు పాల్గొన్నారు.

పాస్టర్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

మలికిపురం: రాష్ట్రంలో పాస్టర్ల అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని జెడ్పీటీసీ బల్ల ప్రసన్న కుమారి పేర్కొన్నారు. మలికిపురం జాన శంకరయ్యా కల్యాణ మండపంలో సఖినేటిపల్లి, మలికిపురం మండలాల కోనసీమ పాస్టర్స్ వెల్ఫేర్ అస్సోసియేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ అవుట్ రీచ్ కార్యక్రమంలో ఆమె పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ప్రపంచానికి మార్గ దర్శకమని అన్నారు.

బాల్య వివాహాలు నిషేధించాలి

రావులపాలెం: బాల్య వివాహాలను నిషేధించాలని శనివారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ కె.రజని పరివేక్షణలో అవగాహన సదస్సు, ర్యాలీ, మానవహారం కార్యక్రమాలను నిర్వహించారు. ఉమెన్స్ అసోసియేషన్ ఫర్ జెండర్ ఈ క్వాలిటీ ఆర్గనైజేషన్ కన్వీనర్ పి.శేషారత్నం, కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో వక్తలు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్ ఎస్ ఎస్ అధికారి ఎస్. అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు సుభాషిని, సోని, యువరాజ్, సౌజన్య,హేమలత విద్యార్థులు పాల్గొన్నారు.

గడప గడపకూ నిధులతో అభివృద్ధి పనులు

రాజోలు: రాజోలులో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రాజోలులో పర్యటించిన సమయంలో గుర్తించిన పలు సమస్యలను పరిష్కరించేందుకు నాలుగు సచివాలయాలకు రూ.80 లక్షల నిధులు మంజూరు చేశారు. నిధులతో జరుగుతున్న పనులను శనివారం సర్పంచులు, ఎంపీటీసీలు పరిశీలించారు.

గ్రామాలు ప్రగతి సాధించడమే లక్ష్యం

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాలు అన్ని రంగాల్లో సమగ్రమైన ప్రగతిని సాధించడమే లక్ష్యంగా ప్రధాని మోదీ కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, ఉత్తరంధ్రా జిల్లాల బీజేపీ ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి కొల్లి సూర్యారావు అన్నారు. వికాసిత్ భారత సంకల్ప యాత్రలో భాగంగా ఇరుసుమండ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అక్కిశెట్టి నాగమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సూర్యారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బుడిటి సత్యనారాయణమ్మ, సత్తిబాబు,వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.